www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 5 నవంబర్ 2023
5
అన్నమయ్య

'గురుకులం' విద్యార్థిని అదృశ్యం

ఆశ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులోని గిరిజన బాలికల వసతి గృహం నుంచి ఓ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన చోటు చేసుకుంది. శనివారం ఉదయం వసతి గృహం నుండి ఆశ (13) అని విద్యార్థిని అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. కలికిరి మండలంలోని గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహం పీలేరు పట్టణం, కోటపల్లిలో అద్దె భవనంలో నడుపుతున్నారు. ఇందులో సంబేపల్లె మండలం, వడ్డపల్లికి చెందిన అనసూయ కుమార్తె ఆశ (13) 7వ తరగతి చదువుతోంది. వసతి గృహం నుంచి అదృశ్యమైన విద్యార్థిని ఆచూకీ తెలిసినవారు పీలేరు సిఐ 9440796744, ఎస్ఐ 9440796745 సెల్ నెంబర్లకు వెంటనే సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఇదే వసతి గృహం నుంచి ఇటీవల ఇద్దరు విద్యార్థులు మాయమై తమ అమ్మమ్మ ఇంట ఉండడంతో పరిస్థితులు సద్దుమణిగాయి. అదే పరిస్థితి పునరావృతం కావడంతో గురుకుల విద్యాలయం ఉద్యోగులు సిబ్బందిలో ఆందోళన నెలకొంది. భద్రత లేని అద్దె భవనాల్లో వసతి గృహాలు నిర్వహిస్తుండడం వల్లే ఇలాంటి సంఘటనలకు కారణమవుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఆరోగ్య సురక్ష రెఫరల్ కేసులపై దృష్టి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాలలో గుర్తించిన రిఫరల్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ గిరీష పిఎస్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె ఎస్ జవహర్ రెడ్డికి వివరించారు. శనివారం విజయవాడ సిఎస్ కార్యాలయం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష, మహిళా శిశు సంక్షేమం, విద్యార్థుల గ్రాస్ ఎన్రోల్మెంట్ బాల్య వివాహాల నివారణ, నాడు- నేడు, జగనన్నకు చెబుదాం అంశాలపై వివిధ కార్యదర్శులతో కలిసి కలెక్టర్లు, జెసిలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాలను విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. ఆయా కేంద్రాల్లో రెఫరల్ కేసులను గుర్తించిన కేసులపై ప్రత్యేక దృష్టి సారించి చికిత్స అందించడానికి చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఇందులో దాదాపు 70 శాతం మదనపల్లి ఏరియా ఆసుపత్రికి రెఫరల్ కేసులు నమోదయ్యాయని చెప్పారు. ఆరోగ్యశ్రీ కింద చికిత్సలు చేయించుకున్న వారు డిశ్చార్జ్ తర్వాత అవసరమైన మందులు ఉచితంగా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వైఎస్ఆర్ కంటి వెలుగు పథకం కింద అవసరమైన వారికి కాటరాక్ట్ సర్జరీలు కూడా జరుగుతున్నట్లు తెలిపారు. జిల్లాలో వందశాతం విద్యార్థుల గ్రాస్ ఎన్రోల్మెంట్ పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కరువు పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొంటాం : 'గడికోట'

ప్రజాశక్తి-రామాపురం

కరువు పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొంటామని శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గడికోట-కాలేటివాగు జిఎన్ఎస్ఎస్ పనులుపై ఇరిగేషన్ అధికారులుతో ఆరా తీశారు. వెలిగల్లు ప్రాజెక్ట్ నుంచి దొర్రిచెరువు 56 కిమీ వరకు రామరాజు వంక వరకు కాలువల ద్వారా చెరువులకు నీరు చేరుతోందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ దూరదృష్టితో ప్రాజెక్టులను నిర్మించారన్నారు. రైతులకు తోడుగా నిలుద్దామన్నారు. ఈ ఏడాదిలో పదున్ల వాన కూడా పడలేదన్నారు. రామాపురం మండలాన్ని ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించిందన్నారు. డిసెంబర్ 6 వరకు వెలిగల్లు నీటిని విడుదల చేయిస్తామన్నారు. నీటిని వృధా కానీవ్వకుండా అన్ని చెరువులను నీటితో నింపుతామన్నారు. మండలంలో 1800 ఎకరాలలో రైతులు పంటలు సాగుచేసారని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. వ్యవసాయానికి ఏడు గంటల పాటు విద్యుత్ సరఫరా జరుగుతోందని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగేళ్లలో 5600 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు(ట్రాన్స్ ఫార్మర్లు) అందించినట్లు చెప్పారు. చుక్కల భూముల విషయంలో రైతులకు శాశ్వత పరిష్కారాన్ని వైసిపి ప్రభుత్వం చూపించిందన్నారు. ఈ నెల 15 నుంచి పేదలకు భూ పట్టాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అసైన్‌మెంట్, చుక్కల భూముల వివరాలును నోటీస్ బోర్డులలో పెట్టాలని సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

అవినీతి రహితంగా రైతులకు సేవలు అందించి మంచి పేరు తెచుకోవాలని, సంక్రాంతికి బట్టలు పెట్టి గౌరవిస్తా మన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జనార్ధన్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు, రవిశంకర్‌రెడ్డిబాబు, జడ్‌పిటిసి వెంకటరమణ, సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు పెద్దిరెడ్డి ఆదినారాయణరెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, తహాశీల్దార్ అరవింద కిషోర్, ఎంపిడిఒ హైదరవల్లి, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సామాజిక సాధికారతకు రూ.లక్ష కోట్లు కేటాయిస్తాం

- విసికె పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్

పోస్టర్ ఆవిష్కరిస్తున్న శివప్రసాద్, నాయకులు

ప్రజాశక్తి-పీలేరు

విసికె పార్టీ ఆధ్వర్యంలో త్వరలోనే రాష్ట్రంలో మూడో ఫ్రంట్ ఏర్పాటు చేస్తున్నామని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు మూడో ఫ్రంట్‌ను గెలిపిస్తే బడుగుజన ప్రభుత్వంలో సామాజిక సాధికారతకు రూ.లక్ష కోట్లు కేటాయించి, యువతకు పారిశ్రామిక, వ్యాపార రంగాల్లో ఉపాధి కల్పిస్తామని విసికె పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ తెలిపారు. శనివారం అయన పీలేరు నియోజకవర్గ పర్యటన సందర్భంగా స్థానిక విసికె పార్టీ కార్యాలయంలో విసికె, భారతీయ అంబేద్కర్ సేన (బాస్) ముఖ్య ప్రతినిధులతో శివప్రసాద్ సమావేశమయ్యారు. విసికె పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన అంబేద్కర్ బడుగు వికాసం పథకం గోడ పత్రికను విసికె పార్టీ రాష్ట్ర కార్యదర్శి పాలకుంట శ్రీనివాస్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం శివప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాజిక, సాధికారతకు పూర్తిగా పాతరేశాయని, నాలుగన్నర ఏళ్లుగా కార్పొరేషన్లకు రూపాయి కూడా విదిలించలేదని విమర్శించారు. అన్ని సామాజిక వర్గాలకూ అన్యాయం చేసి, సామాజిక సాధికార బస్సు యాత్ర పేరుతో వైసిపి నాయకులు నిస్సిగ్గుగా ఊరేగటం, నేతి బీరకాయలో నెయ్యి చందంగా ఉందని ఎద్దేవా చేశారు. కార్పొరేట్, పెత్తందారీ ప్రభుత్వాలకు చరమగీతం పాడి, రాష్ట్రంలో సామాజిక సాధికారతను సాధించేందుకు పేద, మధ్యతరగతి వర్గాల ప్రభుత్వం ఏర్పాటు దిశగా విసికె పార్టీ కృషి చేస్తోందని చెప్పారు. అందుకోసం అదుతేమైన మేనిఫెస్టోను విసికె పార్టీ ప్రకటించిందని, ఇందులోని అంబేద్కర్ బడుగు వికాసం పథకానికి ఐదేళ్లలో రూ.లక్ష కోట్లు కేటాయించామన్నారు. సంవత్సరానికి రూ.5వేల కోట్లు చొప్పున ఐదేళ్లల్లో ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.25 వేల కోట్లు, సంవత్సరానికి రూ.10 వేల కోట్లు చొప్పున ఐదేళ్లల్లో బీసీ కార్పొరేషన్ కు రూ.50 వేల కోట్లు, సంవత్సరానికి రూ.2వేల కోట్లు చొప్పున ఐదేళ్లల్లో ఎస్టీ కార్పొరేషన్ కు రూ.10 వేల కోట్లు, సంవత్సరానికి రూ.2 వేల కోట్లు చొప్పున ఐదేళ్ళల్లో మైనార్టీ కార్పొరేషన్ కు రూ.10 వేల కోట్లు, సంవత్సరానికి రూ.500 కోట్లు చొప్పున ఐదేళ్ళల్లో ఓసీ కార్పొరేషన్ కు రూ.2500 కోట్లు, సంవత్సరానికి రూ.500 కోట్లు చొప్పున ఐదేళ్ళల్లో వికలాంగుల కార్పొరేషన్ కు రూ.2500 కోట్లు కేటాయించి, చైనా తరహాలో రాష్ట్రంలో విస్తృతంగా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో విసికె రాష్ట్ర కార్యదర్శులు శ్రీనివాసులు, మోహన్, బాస్ నాయకుడు కృష్ణయ్య, నాయకులు సుబ్రహ్మణ్యం, వెంకటరెడ్డి, శివకుమార్, గురవయ్య పాల్గొన్నారు.

కనికరమేదీ?

'ప్రజా'దృష్టి'

జిల్లాలో కరువు కరాళనృత్యం చేస్తోంది. ఖరీఫ్ తరహా వాతావరణ పరిస్థితులే రబీలోనూ కొనసాగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర నిబంధనల పేరుతో కరువును తగ్గించి చూసే ప్రయత్నం చేయడం విడ్డూరమనే చెప్పాలి. రాజకీయ కోణంలో కరువు పరిస్థితులను అంచనా వేయ కుండా వాస్తవ పరిస్థితులను మానవతా దృక్పథంలో పరిశీలన చేసి రైతాంగానికి న్యాయం చేయాల్సిన అవసరం ఉరుముతోంది. వాతావరణంలో చిన్నమార్పు చోటుచేసుకున్నా రైతాంగమే ఎక్కువగా నష్టపోతున్నారనే విషయాన్ని గమనంలో ఉంచుకుని కరువు మండలాలను గుర్తించాలి. ఇటువంటి మావనతా దృక్పథాన్ని విస్మరించి, రాజకీయ కోణంలో కరువు మండలాలను గుర్తించడం విడ్డూరమనే చెప్పాలి. తమది రైతు ప్రభుత్వమని చెప్పుకునే పాలకులు ఇటువంటి నిర్ణయాలు తీసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. కడప జిల్లాలో 17 మండలాల్లో కరువు పరిస్థితులు పతాకస్థాయికి చేరుకున్నాయి. జిల్లా అధికార యంత్రాంగం కరువు మండలాలను గుర్తించింది. కరువు మండలాల ప్రతిపాదనల్ని అందజేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జిల్లాలోనే కరువు తాండవం చేస్తుంటే పాలకులు కళ్లు మూ సుకుని ఉన్నారనే విమర్శలు వస్తాయనే కోణంలో ఒక్క ప్రాంతాన్ని కరువు మండలముగా ఎంపిక చేయకపోవడం గమనార్హం. అన్నమయ్య జిల్లాలో 23 మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొని ఉన్నాయని జిల్లా అధికార యంత్రాంగం గుర్తించింది. కరువు మండలాల ప్రతిపాదనల్ని అందజేసింది. జిల్లా అధికార యంత్రాంగం కేంద్రప్రభుత్వం పేర్కొన్న పారామీటర్ల మేరకు కరువు మండలాలను గుర్తించిన సంగతి తెలిసిందే. రాష్ట్రప్రభుత్వం రాజకీయ కోణంలో పరిశీలించి కడప జిల్లాలో కరువు మండలాల గుర్తింపును ఉద్దేశపూర్వకంగా విస్మరించిందనే చెప్పాలి. ఇదేతరహాలో అన్నమయ్య జిల్లాలో 23 మండలాలకుగానూ 18 మండలాలకు కుదించడం విస్మయాన్ని కలిగించింది. ఒక్కో మాసంలో ఒకటి నుంచి రెండు డ్రైస్పెల్స్ నమోదు కావడం వంటి పారామీటర్లను దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదనలు పంపించినప్పటికీ ఎంపిక చేయకపోవడం విస్మయాన్ని కలిగించింది. ఇటువంటి రాజకీయ కుత్సితాలతో రైతాంగాన్ని ముడివేయడం అభ్యంతరకరమని చెప్పాలి. రాష్ట్ర ప్రభుత్వం పక్షపాత రాజకీయ ధోరణుల్ని నిలదీస్తూ జిల్లా రైతాంగాన్ని రౌండ్ టేబుల్స్, ఇతర నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తేనే కరువు మండలాల సవరింపు ఉంటుందనే సంగతిని గుర్తించుకుని ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సి ఉంది. ఇటువంటి బృహత్తరమైన ఉద్యమ కార్యకలా పాలను రైతు సంఘాల నాయకులు ఉధృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు. ఇటువంటి రాజకీయ కుత్సితాలను గుర్తించి ప్రభుత్వ తీరును నిశితంగా విమర్శిస్తూ రైతాంగం రోడ్డుపైకి వచ్చినప్పుడు రాజకీయ పార్టీల నాయకత్వాలను రైతాంగ సమస్యలపై దృష్టి సారించేలా చేసినప్పుడే రైతు సంఘాల నాయకత్వాలు వర్ధిల్లగలవని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

లలితమ్మను సన్మానిస్తున్న నిర్వాహకులు

లలితమ్మకు ఉత్తమ ఎన్‌జిఒ అవార్డు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విజయవాడ తాడేపల్లి క్లబ్‌లో ఫిక్కి ఆధ్వర్యంలో జరిగిన 3వ వార్షిక సమావేశంలో మదనపల్లెకు చెందిన పోర్డ్ సంస్థ డైరెక్టర్ లలితమ్మ ఉత్తమ ఎన్‌జిఒ అవార్డు అందుకొన్నారు. రెండు రోజులుపాటు ఈ నెల 4, 5వ తేదీల్లో జరగనున్న కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఇస్మా (ఇండిపెండెంట్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్) నుండి ఉత్తమ ఎన్‌జిఒగా గుర్తింపు నిస్తూ ఇస్మా రాష్ట్ర అధ్యక్షులు శ్రీకాంత్, ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి, రీజినల్ డైరెక్టర్ శాకర్ చంద్ర, కో-చైర్‌పర్సన్ ప్రవీణ్ రాజు లలితమ్మను శాలువతో సన్మానించి అవార్డు, సిల్వర్ పతకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ సేవలను గుర్తించి అవార్డు,మెడల్ అందజేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఇది తన బాధ్యతను మరింతగా పెంచిందన్నారు. తనను అవార్డుతో గౌరవించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రజల ఆరోగ్యం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా వైద్య సేవలను జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా అందించడం జరుగుతోందని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్.ఎ.కరీముల్లా, 14వ వార్డు కౌన్సిలర్ షేక్ షబానా పేర్కొన్నారు. శనివారం 14వ వార్డు పరిధిలో స్థానిక ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా చలపతి, కౌన్సిలర్ పాల్ చంద్రశేఖర్, నాయకులు శ్రీనివాసరావు, రాజేష్, మునిసిపల్ కమిషనర్ ప్రమీల, డిఇ శిరీషా, సచివాలయం అడ్మిన్ హరిప్రసాద్‌రెడ్డి, వీరభద్ర, ఎఎన్ఎం నాగరత్న, వైద్య సిబ్బంది, వాలంటీర్లు ప్రజలు పాల్గొన్నారు.

రైతు కంట కన్నీరు

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- చెరువుల్లో చుక్క నీరు లేని వైనం
- నట్టేట ముంచిన వేరుశనగ
- అప్పుల ఊబిలో రైతన్నలు
- వర్షం కోసం ఎదురుచూపులు
- కరువు మండలాల ప్రకటనలోనూ చిన్నచూపు

సంబేపల్లె మండలంలోని నాగిరెడ్డిగారిపల్లెలో నీరు లేక ఎండిపోయిన వేరుశనగ

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాలో 30 మండలాలో దాదాపు అన్ని మండలాల్లో భూగర్భ జలాలు అడుగంటి పంటలకు నీరు అందక రైతులు వెలవెలాడుతున్నారు. ఖరీఫ్ 2023 సాధారణ సాగు 82,589 హెక్టార్లు, సాగు చేసిన విస్తీర్ణం 35,942 హెక్టార్లు, రబీ సాధారణ సాగు 26,238 హెక్టార్లు. ఇప్పటి వరకు సాగు చేసిన విస్తీర్ణం 5032 హెక్టార్లు మాత్రమే. వేరుశనగ పంటకు సకాలంలో మీరు లేకపోవడంతో వేసిన పంట ఎండిపోవడం చెట్టు ఎదుగుదల లేక రైతు పెట్టిన పెట్టుబడి అంతా నేలపాలైంది. అయినప్పటికీ రైతులకు పెట్టిన ఖర్చులు కూడా రాకుండా పంట ఎండిపోవడంతో వారు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. రైతులు వర్షం కోసం ఆకాశం వైపు ఎదురుచూస్తూ ఎప్పుడు తమ ఆశలు చిగురిస్తాయా అని ఎదురు చూస్తున్నారు. 5, 6 నెలలుగా వర్షాలు లేక చెరువుల నిండక రైతులు లబోదిమంటున్నారు. ముఖ్యంగా వరి, చెరకు, వేరుశనగ, టమోట, బొప్పాయి, పసుపు వంటి పంటలకు కచ్చితంగా నీరు ఉండాల్సిందే. అలాంటి పంటలకు నీరు లేకపోవడంతో పంటలన్నీ ఎండిపోయే రైతుల ఆశలన్నీ అడియాశలుగా మారాయి. ముఖ్యంగా భూగర్భజాలలో అడుగంటి బోర్ల కింద వ్యవసాయం చేస్తే రైతులకు కూడా నీరందక నీటి కోసం నానాతిప్పలు పడుతున్నారు.

కొన్నే కరువు మండలాల ప్రకటన..

రాష్ట్ర ప్రభుత్వం కేవలం అన్నమయ్య జిల్లాలోని గాలివీడు, రాయచోటి, చిన్నమండెం, లక్కిరెడ్డిపల్లి, రామాపురం, గుర్రంకొండ, కలకడ, కంభంవారిపల్లి, పీలేరు, సుండుపల్లి, వీరబల్లి, తంబళ్లపల్లి, పెద్దమండెం, కురబలకోట, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోటలను తీవ్రంగా ప్రభావితమైన

కాటిమాయకుంటలో నీరు లేని చెరువు

కరువు మండలాలుగా, నందలూరు, పెనగలూరును మధ్యస్తంగా ప్రకటించి చేతులు దులుపుకొంది. జిల్లాలో అధికారులు పర్యటించి ఎంత మేరకు పంట దెబ్బతిందో అంచనా వేయాల్సిందిపోయి వారు కేవలం కార్యాలయాలకు పరిమితం అవడంతో రైతులు ఆక్రోషంతో ఉన్నారు. కనీసం వారికి సరైనటు వంటి సూచనలు, సలహాలు ఇవ్వకపోవడంతో వర్షాభావంలో ఎలాంటి పంటలు వేయాలో తెలియక సతమతమవుతున్నారు. గత ఖరీఫ్, రబీలలో దెబ్బతిన్న పంటలకు కనీసం నష్టపరిహారం అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. అన్నమయ్య జిల్లాలోని పింఛా, అన్నమయ్య ప్రాజెక్టులు 2021లో కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయాయి. నేడు చుక్క నీరు లేకుండా డ్యాములు వెలవెలబోతున్నాయి. నిర్మాణానికి అధికారులు శ్రద్ధ చూపకపోవడం పట్ల రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలు లేకపోవడం వల్ల నిత్యావసర, కూరగాయలు ధరలు అందుబాటులో లేకుండా పోయాయి ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అన్నమయ్య జిల్లాల్లో అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

నష్టపరిహారం ఇవ్వాలి

ఖరీఫ్‌లో పంటలు సాగు చేశాం. వర్షాలు కురవకపోవడంతో ఎండిపోయాయి. పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. రబీలో వరి పంట నాటడానికి వరి నారు వేశాను. వర్షాలు కురవకపోవడంతో అదీఎండిపోయింది. ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి .

- కె.రెడ్డప్ప, రైతు, మాధవరం, రాయచోట.

కరువు మండలాలుగా అన్నింటినీ ప్రకటించాలి

జిల్లాలోని కూలీలను, రైతులను రాష్ట్ర ప్రభుత్వం అడుకోవాలి. కౌలు రైతులతో సహా రైతులందరికీ స్కిల్ ఆఫ్ ఫైనల్స్ ప్రకారం పంట రుణాలు అందించాలి. రైతుల పంట రుణాల బకాయిలను ఒక పర్యాయం రద్దు చేయాలని కేరళ రాష్ట్రంలో ఉన్నట్లు రైతు రుణ ఉపశమనం చట్టం పార్లమెంటులో ఆమోదించి రైతుల ఆత్మహత్యలను అరికట్టాలి. తక్షణం పంట నష్టపోయిన రైతులను రూ. 50 వేలు, పంట వేయని రైతులకు రూ. 25 వేల చొప్పున ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి. పజా పంపిణీ వ్యవస్థను సార్వత్రికం చేయాలి. జిల్లావ్యాప్తంగా వర్షం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.జ అన్నమయ్య జిల్లాలోని అన్ని మండలాలను కరువు జిల్లాగా ప్రకటించాలి.

- సిరిపురి రామచంద్ర, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.

సమావేశంలో మాట్లాడుతున్న గంటా నరహరి

'అన్నమయ్య' వరద బాధితులను ఆదుకుంటాం : 'గంటా'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి కొట్టుకుపోయి, సర్వం కోల్పోయిన పరివాహక ప్రాంత ప్రజలను ఆదుకుంటామని టిడిపి పార్లమెంట్ అభ్యర్థి గంటా నరహరి తెలిపారు. శనివారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడం వలన ప్రాజెక్టు పరివాహక ప్రాంతాలలో ప్రాణ, ఆస్తి నష్టంతోపాటు ప్రజలు సర్వం కోల్పోయారని తెలిపారు. వారిని ఆదుకుని మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని త్వరలోనే వరద బాధిత ప్రాంతాలను సందర్శించి వారికి సహాయ సహకారాలు అందించడంతోపాటు టిడిపి ప్రభుత్వం రాగానే వారిని అన్ని విధాల ఆదుకుంటుందని పేర్కొన్నారు. పేద ప్రజలకు ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు త్వరలోనే పునఃప్రారంభిస్తామని చెప్పారు. తమిళనాడు రాష్ట్రంలో పేద ప్రజల కోసం జయలలిత ప్రారంభించిన అమ్మ క్యాంటీన్లు ఆమె తదనంతరం ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రభుత్వంలో క్యాంటీన్లను కొనసాగిస్తున్నారన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఏ పథకాలనైనా పార్టీలకు అతీతంగా ప్రభుత్వాలు కొనసాగించాల్సి ఉండగా వైసిపి ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు జైలు నుంచి విడుదలైన శుభ సందర్భంగా రాజంపేట పార్లమెంట్ పరిధిలోని ఆరు మండలాలలోనూ తిరిగి అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తామని తెలిపారు. తొలుత రాజంపేటలోనే ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి రాజంపేట రూరల్ మండల అధ్యక్షులు గన్నే సుబ్బ నరసయ్య నాయుడు, సుండుపల్లె మండల అధ్యక్షులు రెడ్డప్ప, పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి, ఒంటిమిట్ట మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు పాల్గొన్నారు.

జనసేనకు అవకాశం ఇవ్వండి : 'మలిశెట్టి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్ర అభివృద్ధి కోసం జనసేనకు ఒక అవకాశం ఇవ్వాలని రాజంపేట జనసేన పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి మలిశెట్టి వెంకటరమణ కోరారు. పట్టణంలోని ఈడిగపాలెం, మార్కెట్ వీధులలో శనివారం 120వ రోజు పవనన్న ప్రజాబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవనన్న ప్రజాబాట కార్యక్రమం ద్వారా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళతామన్నారు. పవన్ కల్యాణ్ ప్రజలకు అండగా నిలుస్తున్నారని, ఆయన ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని తెలిపారు. రానున్న ఎన్నికలలో గాజు గ్లాస్ గుర్తుకు ఓటేసి జనసేనను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర చేనేత వికాస కార్యదర్శి రాటాల రామయ్య, నాయకులు భాస్కర్ పంతులు, లీగల్ సెల్ ఉపాధ్యక్షులు కత్తి సుబ్బరాయుడు, ఆచారి, గోపి, గోవర్ధన్, కిషోర్, జనసేన వీర మహిళలు జడ్డా శిరీష, మాధవి పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న వెంకటరమణ

జర్నలిస్టులకు ఇళ్ల పట్టాల ప్రకటనపై హర్షం

ప్రజాశక్తి -రాయచోటి

జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు ఇస్తుండడం హర్షణీయమని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎక్కడైనా, ఎవరికైనా ఏ అవసరం వచ్చినా, కుటుంబం కంటే సమాజానికి ప్రాధాన్యత ఇస్తూ విలువలుతో కూడిన జర్నలిజం చేస్తున్న జర్నలిస్టులందరికీ అభినందనలు తెలిపారు. ఎన్నికల ముందు చెప్పిన విధంగా మేనిఫెస్టోలోని హామీలన్నింటినీ నూటికి నూరు శాతం నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని అన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామనడం, జర్నలిస్టులకు మూడు సెంట్ల భూమిని పట్టాలుగా ఇస్తుండడం చాలా గొప్ప విజయమన్నారు. అక్రిడేషన్ పొందిన విలేకర్లందరికీ 3 సెంట్ల స్థలాలను ఇవ్వనున్నారని తెలిపారు. త్వరలో కలెక్టర్‌ను కలిసి అనుకూలమైన స్థలాలను పరిశీలించి పట్టాలు అందజేస్తామన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలిస్తున్న ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఓటర్ల పరిశీలనలో పాల్గొనాలి

ప్రజాశక్తి - రాయచోటి

నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల్లో ఆయా గ్రామాల్లో ప్రతి పోలింగ్ బూత్ వద్ద రేపు ఓట్ల వెరిఫికేషన్ నిర్వహిస్తున్నారని టిడిపి రాయచోటి నియోజకవర్గ నాయకులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లోని టిడిపి బూతు కమిటీ కన్వీనర్లు, గ్రామ కమిటీ అధ్యక్షులు, గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఓట్లు ఉన్నాయో లేదో సరి చూసుకోవాలని తెలిపారు. ఓట్లు లేనివారిని గుర్తించి వెంటనే ఓటు హక్కు కు దరఖాస్తు చేయించాలని సూచించారు. శని, ఆదివారాలు రెండు రోజులు పాటు నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనాలని టిడిపి కుటుంబ సభ్యులకు అయన పిలుపునిచ్చారు.

దీప బ్లడ్ బ్యాంకులో రక్తదానం

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలోని దీప బ్లడ్ బ్యాంక్‌లో శనివారం ఇద్దరు యువకులు రక్తదానం చేశారు. పీలేరు పట్టణంలో శ్రీనివాస్ గుప్తా ఆస్పత్రిలో లత అనే గర్భిణి ప్రసవం కోసం చేరారు. ఆమెకు అకస్మాత్తుగా రక్తం అవసరమని డాక్టర్లు సూచించడంతో పీలేరు ప్రాంతంలో అందుబాటులో లేకపోవడంతో వెంటనే రాయచోటి మీ నేస్తం సేవా సంస్థ వ్యవస్థాపకులు భూపతి యాదవ్‌ను ఆమె బంధువులు సంప్రదించడంతో వెంటనే ఆంజనేయులు అనే యువకుడిని పిలిపించి బి పాజిటివ్ రక్తం అందజేశారు. దీంతో ఆయనకు ప్రాణాపాయం తప్పినట్లు తెలిపారు. తాము రక్తం అవసరమైన వారికి అన్నివేళలా ముందుండి తమ సంస్థ ద్వారా వీలైనంతవరకు ఆయన తెలిపారు. రక్తదానం ప్రాణదానంతో సమానం అని యువకులు రక్తదానం చేయడం వల్ల ఇతరులకు ప్రాణదానం చేసినట్లు అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో దీపా బ్లడ్ బ్యాంక్ సిబ్బంది సులోచన పాల్గొన్నారు.

రక్తదానం చేసిన యూత్ ఐకాన్ వినయ్ కుమార్

పట్టణానికి చెందిన మనీషా అనే మహిళకు రక్తం అత్యవసరం కాగా ఆమె కుటుంబ సభ్యులు డాక్టర్ అబ్దుల్ కలాం యువ ట్రస్ట్ డైరెక్టర్ యూత్ ఐకాన్ వినయ్ కుమార్‌ను సంప్రదించగా తానే స్వయంగా దీప బ్లడ్ బ్యాంక్ శనివారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ మాట్లాడుతూ ఇది తన 12వ రక్తదానమని , తాను ప్రతి మూడు నెలలకు ఒకసారి కచ్చితంగా రక్తదానం చేస్తానని పేర్కొన్నారు. రక్తంతో కొలెస్ట్రాల్ లెవెల్స్ సమంగా ఉంటాయని పేర్కొన్నారు. రక్తదానం చేయడానికి యువత ముందుకు రావడంలేదని దాని మూలంగా రక్త కొరత ఎక్కువగా ఉందని తెలిపారు.

విశ్వరూప మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఈ నెల 11న హైదరాబాద్ నగరంలో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు వై.రవీంద్ర పిలుపునిచ్చారు.శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వై.రవీంద్ర మాట్లాడుతూ ఈ నెల 11న హైదరాబాదులో పెరెడ్స్ గ్రౌండ్‌లో ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. ఈ సభకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముఖ్య అతిథిగా విచ్చేస్తారని వెల్లడించారు. అన్నమయ్య జిల్లా నలుమూలల నుండి మాదిగ బిడ్డలు అధికారులు సంఖ్యలో ఈ విశ్వరూప మహాసభకు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

వైసిపితోనే మహిళలకు పెద్దపీట : 'చింతల'

ప్రజాశక్తి-కలికిరి

వైసిపి ప్రభుత్వంలోనే జగనన్న పాలనలోనే మహిళలకు పెద్దపీట వేశారని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వెల్లడించారు. శనివారం స్థానిక మండలంలోని మహల్ గ్రామంలో గడపగడప కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి సమస్యలు అడుగు తెలుసుకొని ఈ సందర్భంగా మహిళలను ఉద్దేశించి గతంలో ఏ ప్రభుత్వము ఎన్నడూ చేయని విధంగా ప్రతి వ్యక్తికి ఏదో ఒక పథకంలో ఆదుకున్న ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని తెలియజేశారు. నవరత్నాల్లో భాగంగా ప్రతి ఇంటికి ఏదో ఒక పథకం ద్వారా లక్ష నుండి ఏడు లక్షల వరకు ప్రతి ఇంటికి లబ్ది చేకూరిందని దీనిని ప్రతి ఒక్కరు గమనించాలని కోరారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ మాట్లాడుతూ మహిళలకు మైనార్టీలకు పెద్దపీట వేసిన ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని రాబోయే ఎన్నికలలో వైఎస్ జగన్మోహన్ రెడ్డిని అత్యంత మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చింతల రమేష్ రెడ్డి, ఎంపిపి వేంపల్లి నూర్జహాన్, జడ్‌పిటిసి పద్మజ లోకవర్ధన్, శివయోగి శివాజీ, ప్రదీప్ రెడ్డి, ఎంపిడిఒ గంగయ్య యాదవ్ , తాసిల్దార్ భాగ్యలత, మండల విద్యాశాఖ అధికారి, సర్పంచ్ గంగయ్య, రియాజ్, మండల కో-ఆప్షన్ నెంబర్ రిజ్వానా పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు విజ్‌డమ్ విద్యార్థి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

స్థానిక గాంధీనగర్‌లో ఉన్న విజ్‌డమ్ సిబిఎస్ఇ పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థి డి.శ్రీరాజ్ జగన్‌రెడ్డి రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ప్రదీప్, అడ్మిన్ డైరెక్టర్ మదన్మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్టోబర్ 31న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రైల్వేకోడూరులో నిర్వహించిన జిల్లాస్థాయి కరాటే పోటీలలో అండర్-17 బాలుర విభాగంలో ఈ విద్యార్థి గోల్డ్ మెడల్ సాధించి ఈనెల 8,9,10వ తేదీలలో మన్యం జిల్లా పార్వతీపురంలో జరగబోవు రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. శ్రీరాజ్‌జగన్‌రెడ్డిని పాఠశాల కరస్పాండెంట్, ఉపాధ్యాయులు, పిఇటి, విద్యార్థులు అభినందించారు.

దళితులకు అండగా ఉంటాం : జనసేన

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల పరిధిలోని రాయవరం మిట్టమీదపల్లి దళితులు, రజకులకు ప్రజలకు అండగా ఉంటామని జనసేన నాయకులు శ్రీనివాసరాజులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ మిట్టమీదపల్లి దళిత వాడకు వెళ్లే దారిలో అడ్డంగా గోడను నిర్మించడం దారుణమన్నారు. పేదలు, దళితులు అనే భేదం లేకుండా రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు అండ చూసుకుని వారి పురాతనమైనటువంటి దారిని అడ్డగించడం చాలా బాధాకర మన్నారు. ఈ విషయం పైన మండల అధికారులు కూడా పట్టి పట్టనట్లు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మచ్చ లక్ష్మి నారాయణ మాట్లాడుతూ పురాతన దారికి అడ్డంగా గోడ కట్టి ఖాళీ స్థలం కబ్జా చేయడం దారుణమని అన్నారు. దళిత కుటుంబాలకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. అధికారులు వెంటనే యథా విధిగా పురాతన దారికి అడ్డంగా కట్టిన గోడను తొలగించాలని లేకుంటే నిరాహార దీక్ష కు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గుంటిమడుగు శ్రీనివాసులురాజు, రాజంపేట నాయకులు నరేంద్ర, నజీర్, చలపతి, హరి, సలీం, గంప రాజా, సుగుణమ్మ, స్థానికులు పాముల గోపాలయ్య, నరిసింహులు, బాధిత కుటుంబ సభ్యులునీరుగుట్టు నగేష్, పెద్దవీటి శివ, పెద్దవీటి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

కెవికెను సందర్శించిన గుజరాత్ రైతులు

ప్రజాశక్తి-కలికిరి

కలికిరిలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని శనివారం గుజరాత్ రాష్ట్రం వలసాడ్ జిల్లాకు చెందిన రైతుల బృందం సందర్శించారు. అంతరాష్ట్ర విజ్ఞాన యాత్రలో భాగంగా ఆ రాష్ట్ర ఆత్మ ప్రాజెక్టు నేతృత్వంలో కలికిరి కెవికెకు వచ్చిన రైతులకు కృషి విజ్ఞాన కేంద్రంలోని శాస్త్రవేత్తలు మామిడిలో అంట్లు కట్టే విధానం, అజొల్లా, కోళ్ళు, గొర్రెలపెంపకం గురించి వివరించారు. మామిడిలో ఫ్రూట్ కవర్ల వినియోగాన్ని మామిడి, వేరుశనగ, వరిలో నూతన రకాలు అధిక దిగుబడి కొరకు నూతన పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో కెవికె శాస్త్ర వేత్తలు డాక్టర్ కె.మాధురి, డాక్టర్ వై.పీరుసాహెబ్, డాక్టర్ ఎ.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన అయూబ్‌బాషా

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని జిల్లా వైసిపి ప్రచార కార్యదర్శి అయూబ్ బాషా శనివారం తిరుపతి ఎంపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతోపాటు నియోజకవర్గానికి చెందిన దామోదర్ రెడ్డి, వెంకట శివలు ఎంపీని కలిసిన వారిలో ఉన్నారు.ఈ సందర్భంగా అయూబ్ బాషా మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు తీరు, జరుగుతున్న అభివృద్ధి గురించి ఎంపీకి వివరించినట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని ఆయన సూచించారని చెప్పారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలకు సమాయత్తం కావాలని సూచించారని తెలిపారు.

టపాసుల విక్రయాలకు లైసెన్స్‌లు తప్పనిసరి

ప్రజాశక్తి-పుల్లంపేట

టపాసులు విక్రయాలు చేసే వారికి లైసెన్సులు తప్పనిసరిగా ఉండాలని ఎస్ఐ రఘురాం టపాసుల యజమానులకు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టపాసులు విక్రయించాలంటే తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉన్న వారు మాత్రమే విక్రయించాలన్నారు.అలా కాకుండా లైసెన్స్ లేకుండా విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టపాకాయల విక్రయాలకు కేటాయిం చిన ప్రదేశంలో మాత్రమే విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో టపాసులు వికయాల యజమానులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** దీపావళి పండుగ సందర్భంగా లైసెన్సులు లేని టపాకాయల దుకాణాలపై చర్యలు తప్పవని సిఐ టి.మధుసూదన్ రెడ్డి అన్నారు. లైసెన్సులు కలిగి ఉన్న టపాకాయల దుకాణ యజమానులందరికి రైల్వే కోడూరు సిఐ టి.మధుసూదన్ రెడ్డి, ఎస్ఐ డాక్టర్ నాయక్ స్థానిక కోడూరు పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించి, వారికి టపాకాయల దుకాణాల ఏర్పాట్లలో పాటించవలసిన జాగ్రత్తలు గురించి తగిన సూచనలు ఇచ్చారు. ప్రతి టపాసుల దుకాణానికి మధ్య మూడు అడుగుల దూరం ఉండాలని, ప్రతి దుకాణం ముందు భాగంలో నీళ్ల తప్పనిసరిగా ఉంచాలని, అక్కడికి వచ్చే కస్టమర్ల వాహనాలను దూరంగా ఉంచేటట్లు సరైన పార్కింగ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కోడూరు టౌన్ లోని టపాకాయల లైసెన్స్ దారులు స్థానిక కోడూరు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన గెలుపే లక్ష్యం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జనసేన-టిడిపి కూటమి గెలుపే లక్ష్యంగా ఐకమత్యంతో కలిసి పోరాడాలని జనసేన పార్టీ రాజంపేట అసెంబ్లీ ఇన్‌ఛార్జి మలిశెట్టి వెంకట రమణ, డిఆర్‌డిఎ రాష్ట్ర మాజీ అధికారి ఎల్లటూరు శ్రీనివాసరాజు కలిసి పిలుపు నిచ్చారు. శనివారం ఇండియన్ గ్యాస్ వద్ద గల జనసేన పార్టీ కార్యాలయంలో వారిరువురు సమావేశమై విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ముందుగా ఎల్లటూరు శ్రీనివాసరాజును శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించి సాదరంగా ఆహ్వానించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జనసేన జెండా నియోజకవర్గంలో ఎగరడం ఖాయమని అన్నారు. సమిష్టిగా కృషి చేసి పవన్ కల్యాణ్‌ను అండగా నిలుస్తామన్నారు. ఈ సందర్భంగా మలిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన యల్లటూరు శ్రీనివాసరాజు పార్టీలోకి రావడం, కలిసి పని చేద్దామని ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రాటాల రామయ్య, వెంకటేశ్వ రరావు, భాస్కర పంతులు, కోలాటం హరి, సింగంశెట్టి నరేంద్ర పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

షేక్. అల్లాబకష్, తండ్రి. S.ఫక్రుద్దీన్, వయసు53 సం,,అయిన నేను డోర్ నెంబర్.6 237ు H-1, టెంపుల్ స్ట్రీట్, ,మదనపల్లి టౌన్ అండ్ మండలం, అన్నమయ్య జిల్లా ఆంధ్ర ప్రదేశ్. నందు నివసిస్తూ ఉన్నాను.నా యొక్క పాస్ పోర్ట్ నెం. F3616176.మదనపల్లె APSRTC బస్టాండ్ వద్ద 20-10-2023 పోయినది. కావున ఎవరికైనా దొరికినయెడల పై అడ్రస్సు నందు ఇవ్వవలసిందిగా కోరుతున్నాను.

ఇట్లు : షేక్.అల్లాబకష్, మదనపల్లి.

PUBLIC NOTICE

This is to inform the government and general public that my name is Sidda.Girijadevi alias MUSANI. Girijadevi alias MUSANI Shanti alias Samineni. Girijadevi, W/o M.Vijaya bhaskara reddy. If any-one has any objections,contact me within 7days from now on 9440753377. My Aadhaar no is 8480 6059 9292.

బాల్య వివాహాలను అరికట్టాలి

-జూనియర్ సివిల్ జడ్జి అంజని ప్రియదర్శిని

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి అంజని ప్రియదర్శిని

బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జూనియర్ సివిల్ జడ్జి ఎం.అంజని ప్రియదర్శిని అన్నారు. శనివారం మండలంలోని అనంతరాజుపేట ఎస్‌టి బాలికల మినీ గురుకుల పాఠశాలలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాల్యవివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జూనియర్ సివిల్‌జడ్జి అంజని ప్రియదర్శిని పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహం పిల్లల హక్కులను ఉల్లంఘిస్తోందని, బాల్య వివాహం పిల్లల విద్య, ఆరోగ్యం, రక్షణ, హక్కులను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందని అన్నారు. చిన్నతనంలోనే అవగాహన లోపంతో కొంత మంది తల్లిదండ్రులు ఆడపిల్లలను భారంగా భావించి యుక్త వయసు రాక ముందే పెళ్లి చేస్తున్నారని అన్నారు. అటువంటి ఆడపిల్లలకు జీవితం పైన బాధ్యతలపై సరైన అవగాహన లేకపోవడం గృహహింసను అనుభవించే అవకాశం ఉంటుందన్నారు. అమ్మాయిలు బాగా చదువుకొని తల్లిదండ్రులకు, చదువు చెప్పిన ఉపాధ్యాయులకు, సమాజానికి మంచి పేరు తేవాలని ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. సిఐ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఎవరైనా తల్లిదండ్రులు గానీ, మన చుట్టుప్రక్కల వారు ఆడపిల్లలకు బలవంతంగా బాల్య వివాహం జరిపిస్తున్నట్లయితే తమ దృష్టికి తీసుకరావాలన్నారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. 1098 నెంబర్‌కు ఫోన్ చేసి బాల్య వివాహం జరిగే స్థలం పేరు చెబితే 15 నిమిషాలలో అక్కడికి పోలీసు, రెవెన్యూ, ఐసిడిఎస్ అధికారులు ప్రభుత్వ సంస్థల సహకారంతో ఆ వివాహాన్ని అడ్డుకొని పెద్దలకు నచ్చజెప్పేందుకు కౌన్సిలింగ్ ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ.వెంకట్రామరాజు, సీనియర్ న్యాయవాదులు ఎం.సురేష్‌రెడ్డి, ఎం.శంకరయ్య, టి.చంద్రమోహన్, ఎస్ఎం అంబిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కవిత పాల్గొన్నారు.

8న విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

కరపత్రాలను విడుదల చేస్తున్న విద్యార్థిసంఘనాయకులు

ప్రజాశక్తి-పుల్లంపేట

ఈ నెల 8న జరిగే రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేష్, బిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్‌లు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సభ జూనియర్ కళాశాలలో బంద్‌కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణను విరమించు కోవాలని సూచించారు. కడప ఉక్కు పరిశ్రమను త్వరితగతిన పూర్తి చేయాలనే డిమాండ్‌తో అన్ని విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో 8న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ముఖ్యంగా విశాఖ ఉక్కు కర్మాగారం కోసం ఆనాడు 32 మంది ప్రాణాలు త్యాగం చేశారాని వేలాది మంది రైతులు వేల ఎకరాల భూములను ధారాదత్తం చేశారాని అన్నారు. అపుడు ఉన్న కొందరు రాజకీయ నాయకులు తమ పదవులకు రాజీనామా చేయడంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం విశాఖ ఉక్కును దేశ ప్రజలకు అంకితం చేశారని అన్నారు. అలాంటి ఘన చరిత్ర కలిగిన విశాఖ ఉక్కు పరిశ్రమను నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రయివేట్ పరం చేయాలని కంకణం కట్టుకుం దని అన్నారు. కడప ఉక్కు కర్మాగారంను త్వరితగతిన నిర్మిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యిప్పుడు శంకు స్థాపనలకే పరిమితం చేశారు గానీ, ఫాక్టరీ నిర్మాణానికి ఎటువంటి ప్రయత్నమూ చేయలేదని ఆగ్ర హం వ్యక్తం చేశారు. రిలే నిరాహార దీక్షలు చేపట్టి వంద రోజులు అవుతున్న సందర్భంగా బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ సమస్యల పరిష్కారం కోసం అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థులు, మేధావులు కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నితిన్, పృథ్వి, సాధిక్, లోకేష్ పాల్గొన్నారు.

రైతులు నూతన వంగడాలను సాగు చేయాలి

ప్రజాశక్తి-కలికిరి

ప్రదర్శన క్షేత్రాలను పరిశీలిస్తున్న సుబ్బరామిరెడ్డి

నూతన వంగడాల వైపు రైతులను ఆకర్షించే విధంగా శాస్త్రవేత్తలు అవగాహన కల్పించాలని ఎన్‌జిరంగా విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు సుబ్బిరామిరెడ్డి, ప్రధాన శాస్త్రవేత్తలు డా.కె.గురవారెడ్డి సూచించారు. శనివారం వారు కలికిరి కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కెవికెలోని ప్రదర్శన క్షేత్రాలు, సమగ్ర కోళ్లు, గొర్రెల పెంపకం, వర్మీ కంపోస్టు, నర్సరీలో పెంచుతున్నటువంటి మామి డి అంటు మొక్కలు, మునగ, చీని మొక్కలు, అజోల్లా పెంపకం, కంది పంటలను సందర్శించారు. అనంతరం శాస్త్రవేత్తలతో మాట్లాడి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా విస్తరణ సంచాలకులు మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ముందుగా అభ్యుదయ రైతుల దగ్గర చేయించి, పంటకోత సమయాన పెద్ద ఎత్తున రైతులకు క్షేత్ర దినోత్సవం నిర్వహిం చడం ద్వారా మిగిలిన రైతులకు కూడా నూతన సాంకేతికతపై అవగాహన కల్పించవచ్చని తెలిపారు. జీవన ఎరువులు, లింగాకర్షణ బుట్టలు, జిగురు అట్టలు, మామిడి ఫ్రూట్ కవర్స్ కెవికెలో అందుబాటులో పెట్టాలని శాస్త్ర వేత్తలకు ఆదేశించారు. అలాగే జాతీయ ఆహార భద్రత పథకం కింద రైతు లకు వేరుశనగ టిసిజిఎస్-1694 రకాన్ని రైతులకు పంపిణీ చేశారు. వీటితో పాటు విత్తన శుద్ధికి అవసరమైన ట్రైకోడెర్మా విరిడి, రైజోబియం జీవన ఎరువులను ఇచ్చారు. అలాగే ఈ ఖరీఫ్ 2023 సంబంధించి బెట్ట పరిస్థితులలో వేరుశనగ దిగుబడి ఏ విధంగా వచ్చిందని రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహానంది వ్యవసాయ కళాశాల నుంచి వచ్చినటువంటి విద్యార్థులతో మాట్లాడి వారికి తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ జిఎస్ పాండురంగ, శాస్త్రవేత్తలు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

కలకడ : ఇంటింటి ప్రచారంలో రమేష్‌కుమార్‌రెడ్డి

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి : ఆర్‌ఆర్

ప్రజాశక్తి-కలకడ

భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో రాయచోటి నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి ఆర్.రమేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. సంబేపల్లి మండలం ఎస్.సోమవరం పంచాయతీ అగ్రహారంలో ఇల్లు తిరిగి భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో టిడిపి చేయబోయే కార్యక్రమాలను ప్రజలకు వివరించినట్లు తెలిపారు. టిడిపి మినీ మెనిఫెస్టోను ప్రజలకు వివరించి చెప్పారు. టిడిపి అధ్యక్షులు చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి వైసిపి నాయకులు సంబరాలు చేసుకుంటున్నారని అన్నారు. భవిష్యత్తులో వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. అక్రమంగా చంద్రబాబుపై కేసులు బనాయించి జైల్లో ఉంచనంతమాత్రాన ప్రజా ఆదరణకు లోటు లేకుండా పోయిందని, వచ్చే ఎన్నికల్లో వైసిపిని ప్రజలు భూస్థాపితం చేయడం ఖాయమని చెప్పారు. కార్యక్రమంలో నరసారెడ్డి ,వేణుగోపాల్, రెడ్డయ్య, రవికుమార్, రాహుల్ ,శ్రీనివాసులు, నాగార్జునరెడ్డి, అభిషేక్, రాజశేఖర్ నాయుడు, నారా ప్రభాకర్‌నాయుడు, భాస్కర్‌రెడ్డి, సుబ్బరాజు, గోపినాథ్‌రెడ్డి, సాయికాంత కుమార్ పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని రెడ్డిపల్లి పేట గ్రామంలో రైల్వే కోడూరు టిడిపి ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథనాయుడు ఆదేశాల మేరకు భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం ఇంటింటికి తిరిగి నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్ నాయుడు, ఉపాధ్యక్షులు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ పోలి జగదీశ్వర్ రెడ్డి, బూత్ ఇన్‌ఛార్జి సుబ్బన్న, తెలుగు మహిళ అనిత దీప్తి పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో పొరపాట్లను సరిదిద్దాలి

కలకడ : ఓటర్ల జాబితాను పరిశీలించి పొరపాట్లను సరిదిద్దాలని తహశీల్దార్ ప్రదీప్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని కోన, దొడ్డిపల్లి, గంగాపురం, కలకడ, బాలయ్యగారిపల్లి, బాటవారిపల్లి, పంచాయతీలలో ఉన్న పోలింగ్ స్టేషనులను పరిశీలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో బిఎల్ఓలో ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి తప్పిదాలు ఉంటే కనిపెట్టి వాటిని తొలగించేందుకు ప్రయత్నించాలన్నారు. ఒకే ఓటు రెండుచోట్ల ఉండడం గుర్తించి వాటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. బిఎల్ఓలు రాజకీయాలకు లోను కాకుండా ఓటర్ల జాబితాను నిష్పక్షపాతంగా పరిశీలిం చాలన్నారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల విఆర్ఓలు, బిఎల్ఓలు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

ఓటరు జాబితాను పరిశీలిస్తున్న తహశీల్దార్ ప్రదీప్

విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని దలవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ఎస్ వెంకటరమణ ఉపాధ్యాయ వృత్తిలో 14 వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా తాను మొదట ఉపాధ్యాయ వృత్తిలో చేరిన ఉడుమువారిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యాసామగ్రిని వితరణ చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ తాను మొదట ఉపాధ్యాయ వృత్తిలో చేరిన పాఠశాలలో విద్యాసామగ్రి అందించడం సంతోషంగా ఉందన్నారు.

డిసెంబర్ 9న లోక్ అదాలత్

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో డిసెంబర్ నెల 9వ తేదీన జరిగే లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు స్థానిక న్యాయమూర్తి ఉమర్ ఫరూక్ కోరారు. శనివారం కోర్టులో పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ లోకదాలత్ కార్యక్రమం పై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఇరు వర్గాల కక్షి దారులతో సంప్రదించి చర్చించి ఇరు వర్గాల రాజీ మేరకు అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించేందుకు పోలీసులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సిఐమల్లికా, తంబళ్లపల్లె ఎస్ఐ లోకేష్‌రెడ్డి, పెద్దమండెం ఎస్ఐరామాంజనేయులు, ములకలచెరువు ఎస్ఐ గాయత్రి, పెద్దతిప్ప సముద్రం ఎస్ఐ రవి ,లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

జికా వైరస్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని కోటకొండ ప్రాథమిక పాఠశాలలో ఫ్యామిలీ డాక్టర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు జికా వైరస్ వ్యాధినివారణ అవగాహన సదస్సును నిర్వహించారు. కర్ణాటక రాష్ట్ర పరిసర ప్రాంతాల నుంచి వ్యాప్తి చెందుతున్న వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు మునికుమార్ సచించారు. వైద్య అధికారిని అనుపమ ఆదేశాల మేరకు విద్యార్థులకు జికా వైరస్ లక్షణాలు వ్యాప్తి నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. స్థానిక ప్రజలకు బివి, షుగర్ వ్యాధులకు పరీక్ష నిర్వహించారు. జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతున్న వారికి మందులు పంపిణీ చేశారు.

సచివాలయ కార్యదర్శిగా దేవేంద్ర

కలకడ : పంచాయతీ కార్యదర్శిగా దేవేంద్ర శనివారం బాధ్యతలు స్వీకరించారు.మండలంలోని బాలయ్యగారిపల్లి సచివాలయంలో గతంలో పనిచేస్తున్న బాటవారిపల్లి పంచాయతీ కార్యదర్శి షబానాభాను ఇక్కడ ఇన్‌ఛార్జిగా కార్యదర్శిగా విధులు నిర్వహించారు.ఈ క్రమంలో శనివారం కె.వి.పల్లి మండలం కె.విపల్లిలో సచివాలయ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ బాలయ్యగారిపల్లి సచివాలయం కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవలో ముందుండి సమస్యల పరిష్కారంలో తన వంతు కృషి చేస్తారని తెలిపారు. సచివాలయం సిబ్బంది తనకు సహకరించాలని కోరారు.

సమస్యను పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-ములకలచెరువు

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో శనివారం సంబంధిత పోలింగ్ కేంద్రాలను బిఎల్ఓలచే స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించినట్లు తంబళ్లపల్లె తహశీల్దార్ శ్రీనివాసులు, ములకలచెరువు తహసీల్దార్ సి.శ్రీనివాసులు తెలిపారు. ఆయా తహశీల్దార్ ఆయా మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల పరిధిలోని పలువురు కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ లిస్టులలో చేర్పులు, మార్పులకు తదితర అంశాలపై ఫిర్యాదులు అందుకున్నారు. ఈ స్పెషల్ క్యాంపెయిన్ ఆదివారం కూడా నిర్వహిస్తామన్నారు.

రోడ్డుకి అడ్డంగా ఉన్న కంపచెట్లు

రోడ్డుకు అడ్డంగా కంపచెట్లు

- ఇబ్బందులకు గురవుతున్న వాహనదారులు

- పట్టని అధికారులు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని సుండుపల్లె గ్రామ పంచాయతీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఎగువమాలపల్లి వరకు వెళ్లే మెటల్‌రోడ్డులో ఇరుపక్కల కంపచెట్లు ఏపుగా పెరగడంతో ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామస్తులు రామయ్య, చిన్నప్ప,వెంకటేశులు తెలిపారు. ఈ రోడ్డుపై వాహన రాకపోకలు సాగించాలంటే భయంగా ఉందని ప్రమాదాలు జరిగే అవకాశముందని వాపోయారు. గతంలో ఈ రోడ్డు పనుల కోసం ప్రభుత్వం రూ.60 లక్షలు మంజూరు చేసిందని అన్నారు. కొందరు రాజకీయ నాయకులు స్వార్థ ప్రయోజనాల కోసం పనులను ఆపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు దృష్టికి తీసుకెళ్లిన వారు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపుల ఉన్న కంపచెట్లను తొలగించాలని వారు కోరారు.

బాధితులకు బంగారు ఆభరణాలను అందిస్తున్న ఎస్ఐ

బాధితులకు బంగారు నగలు అప్పగింత

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక గాలివీడు బస్టాండ్ పరిధిలో రూ.1.20 లక్షలు విలువ చేసే బంగారు నగలను పోగొట్టుకున్న భార్యభర్తకు తిరిగి ఆనగలను పోలీసులు అందించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..ఎస్.శ్రీనివాసులు, అంజలి అనే భార్యాభర్తలు ద్విచక్రవాహనంలో కదిరి నుంచి లక్కిరెడ్డిపల్లెలోని చింతకుంట వారి పల్లికి వెళ్లేందుకు బయలు దేరారని తెలిపారు. మధ్యలో అల్పాహారం కోసం గాలివీడు బస్టాండు పరిధిలోని ఆగి అనంతరం వారి బ్యాగులో ఉన్న రూ.1.20 లక్షలు విలువ చేసే బంగారు నక్లెస్, వెండి ఆభర ణాలు, రూ.10వేలును అక్కడే మరచిపోయి వెళ్లారని అన్నారు. అదే సమయంలో బస్టాండ్‌లో ట్రాఫిక్‌లో విధుల్లో ఉన్న హోంగార్డ్ సుధాకర్, వేణుగోపాల్, సుమియాలు ఆ బ్యాగ్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకవచ్చి భద్రపరిచారని అన్నారు. లక్కిరెడ్డిపల్లి ఇంటికి వెళ్ళిన భార్య భర్తలు తర్వాత బ్యాగు చూసుకుంటే కనిపించక పోవడంతో తిరిగి గాలి వీడుకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వెంకటశివకుమార్ స్టేషన్‌లో దాచి వుంచిన బంగారు నగల బ్యాగ్‌ను వారికి అప్పగించడంతో సంతోషంతో వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హోంగార్డులను ఎస్ఐ అభినందించారు.

డ్రెయినేజీ కాలువ పనులు పరిశీలన

ప్రజాశక్తి-కలకడ

పనులను పరిశీలిస్తున్న ఎంపిపి శ్రీదేవి రవికుమార్

డ్రెయినేజీ కాలువ పనులను ఎంపిపి శ్రీదేవి రవికుమార్ పరిశీలిం చారు. మండలంలోని బాటవారిపల్లి పంచాయతీ కలకడ మాదిగపల్లెలో జరుగుతున్న డ్రెయినేజీ కాలువ పనులను పరిశీలించి పనులను నాణ్యతగా చేయాలని ఆదేశించారు. గతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనులను చేయిస్తున్నట్లు ఆమె తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనేక పథకాలు ప్రవేశపెట్టి ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ముందున్నారని కొనియాడారు. ప్రతిపల్లెకు కనీస సౌకర్యాలు కల్పిస్తూ ప్రజలకు అహర్నిశలు శ్రమిస్తూ ప్రజల్లో మనలను పొందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌బ్ల్యూఎస్ ఎఇ సురేంద్ర, ఇంజినీరింగ్ అసిస్టెంట్ చరిష్మాంజలి, పంచాయతీ కార్యదర్శి షబానాబాను, నాయకులు గోపాల్ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి- రామాపురం

మండలం రాచపల్లె గ్రామం కొవ్వూరి వాండ్లపల్లెలో శనివారం నిర్వహించిన అభయ హస్త ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన, కలశ పూజలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. తొలుత కార్యక్రమ నిర్వాహకులు , గ్రామస్తులు కోవ్వూరి నాగసుబ్బారెడ్డి, నాగబసిరెడ్డిల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి మానస వెంకటరమణ, సర్పంచ్ వెంకటరెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు ఆదినారాయణ రెడ్డి, పెద్దిరెడ్డి, చలమారెడ్డి, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణం పరిశీలన

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రమైన ఎస్‌బివిడి సభ సంస్థల క్రీడా ప్రాంగణాన్ని రాష్ట్ర వ్యాయామ తనిఖీ అధికారి భానుమూర్తిరాజు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14న రాష్ట్రస్థాయి స్కూల్ బ్యాండ్ కాంపిటీషన్ జరుగుతున్న నేపథ్యంలో క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సభా సంస్థల కరస్పాండెంట్ నూకల శ్రీరాములు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీమోహన్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆరోగ్య విషయంలో అశ్రద్ధ వద్దు

ప్రజాశక్తి-పీలేరు

ఆరోగ్య విషయంలో అశ్రద్ధ వహిస్తే అనారోగ్య సమస్యలు వెంటాడే ప్రమాదం ఉందని అవి రాకుండా ముందస్తు నివారణా చర్యలు బాగా ఉపకరిస్తాయని డాక్టర్ రమేష్‌రెడ్డి తెలిపారు. శనివారం తలవుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి పట్టణ శివారులోని శంకరాపురంలో మన ఆరోగ్యం మనచేతుల్లో అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల్లో ముఖ్యంగా దోమలు, గాలి, నీరు, ఆహారం ద్వారా చలిజ్వరం, తల, ఒళ్లు నొప్పులు, దగ్గు, వాంతులు, కడుపునొప్పి, విరేచనాలు, నీరసం, వికారం, ఆకలి తగ్గడం ఆరోగ్య సమస్యల విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పర్యవేక్షకులు కుసుమ కుమారి,ఎఎన్ఎం విజయ్ కుమారి, సిహెచ్ఒ ఆయేషా, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - రామసముద్రం

పురుగులు మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి... మదచీశీఅవగండలంలోని కాప్పల్లి గ్రామానికి చెందిన రాఘవరెడ్డి భార్య జ్యోతి (30) పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని అన్నారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. తిరుపతిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.